క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

దుద్యాల్: మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం హోమాలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక హోమం నిర్వహించినట్లు ఆయల ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయరాములు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న స్థానికులు

దౌల్తాబాద్: మండలంలోని బిచ్చాల గ్రామంలో పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం గ్రామ యువకులు ఘనంగా సన్మానించారు. వై శ్రీనివాస్ మండలంలో మూడో ర్యాంక్, శివకుమార్ పాఠశాలలో రెండో ర్యాంక్ సాధించాడు. వీరిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మొహన్, యువకులు అమర్నాథ్ రెడ్డి, గణపతిసింగ్, బస్వరాజ్, రాములు, అనిల్, శీను, వెంకట్ తదితరులున్నారు.

ఆగిన ధాన్యం కొనుగోళ్లు



గోనూర్‌లో కొనుగోళ్ల ప్రక్రియ ఆగిపోవడంతో రోడ్డుపైనే ధాన్యం రాసులు

తాండూరు రూరల్: మండలంలోని గోనూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నిలిచిపోయింది. కేంద్రంలోని మూడు కాంటాలు పని చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గోనూర్, వీర్‌శెట్టిపల్లి, నారాయణపూర్ గ్రామాలకు చెందిన రైతులు వడ్లను ఇక్కడికి తెచ్చి విక్రయిస్తుంటారు. ఉన్న మూడు కాంటాలు చెడిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియను ఆపేసినట్లు కేంద్రం ఇన్‌చార్జ్ వెంకటరమణ తెలిపారు. వ్యవసాయ శాఖ నుంచి కాంటాలు రాగానే కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

సైనికులు క్షేమంగా ఉండాలని పూజలు



కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: పాకిస్తాన్‌తో జరుగుతున్న పోరాటంలో భారత సైనికులు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండాలని బీజేపీ చౌడాపూర్ మండల నాయకులు, హిందూ సంఘాల నాయకులు పూజలు చేశారు. స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం కుటుంబాలను వదిలి పోరాడుతున్న సైనికులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, హిందూ సంఘాల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితాపై అవగాహన ఉండాలి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన ఉండాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలని, ఇళ్ల నిర్మాణం 60గజాలలోపు ఉండాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం, రాజీవ్ యువ వికాసం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీఓ గిరిరాజు, ఏపీఓ నాగభూషణం పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పటికో?

- జారీలో తీవ్ర జాప్యం
- మార్పులు, చేర్పులతో సరి
- అయోమయంలో అర్హులు



ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు(ఫైల్)

దౌల్తాబాద్: కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు తప్పడంలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు ప్రవేశపెట్టడంతో అర్హులైన పేదలు కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. ఎప్పుడు రేషన్‌కార్డులు వస్తాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రమాణికం కావడంతో కార్డులు లేనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో..

కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కానీ ఇప్పటికీ పంపిణీ ప్రక్రియ పూర్తికాలేదు. ఇటీవల కార్డులు జారీ చేసినా చాలా మందికి రాలేదు. ఉన్న కార్డుల్లో పేర్లను తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటి వరకు తల్లిదండ్రుల పేరిట ఉన్న కార్డుల్లో ఉన్న వారు పెళ్లి చేసుకుని భార్య పిల్లలతో కలిసి కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రుల పేర ఉన్న కార్డుల్లో వారి పేర్లను తొలగించుకున్నారు. కొత్త కార్డు రాక, పాత కార్డులో పేరు లేక సన్నబియ్యానికి, రాజీవ్ యువవికాసం వంటి పథకాలకు దూరమయ్యారు. దీంతో చాలా మంది రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో మొత్తం 13 వేలకు పైగా రేషన్‌కార్డులు ఉండగా 36 షాపుల ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం కొత్త కార్డుల కోసం చాలా మంది మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. మరి కొంత మంది తమ పిల్లల పేర్లను చేర్చాలని దరఖాస్తులు చేసుకుంటున్నారు.

పథకాలకు దూరమయ్యా



గతంలో నా పేరు మీద రేషన్‌కార్డు ఉండేది. ఎనిమిదేళ్ల క్రితం కార్డులో నా పేరు తొలగించారు. భార్య, పిల్లల పేర్లు ఉన్నాయి. అప్పటి నుంచి పేరు చేర్చడానికి దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నా. ఇప్పటి వరకు నమోదు చేయలేదు. దీంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నా. వెంటనే పేరు నమోదు చేయాలి.

– మంత శ్రీనివాస్, దౌల్తాబాద్

దరఖాస్తు చేసినా రాలేదు



నాకు వివాహమై నాలుగేళ్లవుతోంది. తల్లిదండ్రుల కార్డులో ఉన్న పేరును తొలగించి భార్య, పిల్లలతో కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. ప్రజాపాలనలో కూడా దరఖాస్తు చేశా. మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు అంటున్నారు. త్వరగా కొత్త కార్డు ఇవ్వాలి.

– మహిపాల్, దౌల్తాబాద్



మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన నాయకులు

పీహెచ్‌సీ మంజూరు చేయాలి

మంత్రిని కోరిన నాయకులు

కుల్కచర్ల: మండల కేంద్రమైన చౌడాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ కోరారు. సోమవారం పరిగి మండలంలో పర్యటించిన మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితోకలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన చౌడాపూర్ మండలంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు మండలాల ప్రజలకు ఒకే ఆస్పత్రి ఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే చౌడాపూర్‌కు పీహెచ్‌సీని మంజూరు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.80 కోట్లతో పంట కాల్వల నిర్మాణం

ఇరిగేషన్ సీఈ రమణారెడ్డి



పంట కాల్వలు పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు

బొంరాస్‌పేట: మండల కేంద్రం శివారులోని బొంబాయి చెరువు ఏటి, పంట కాల్వల నిర్మాణానికి రూ.3.80 కోట్లు మంజూరైనట్లు ఇరిగేషన్ సీఈ రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఈ శ్రీధర్, ఈఈ జోసఫ్, డీఈ కిరణ్‌తో కలిసి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మట్టి కాల్వలు ఉన్నాయని, దీంతో సాగునీరు వృథాగా పోతోందన్నారు. చివరి ఆయకట్టుకు నీరందక సాగు విస్తీర్ణం తగ్గిందని తెలిపారు. దీంతో ప్రభుత్వం పక్కా కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. త్వరలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈలు శ్రీకాంత్, వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, నాయకులు లచ్చప్ప, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బెల్కటూర్‌కు వ్యవసాయ శాస్త్రవేత్తలు

తాండూరు రూరల్: మండలంలోని బెల్కటూర్ రైతు వేదికలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ మండల అధికారి కొమరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని మండల రైతులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

‘పాంబండ’ను అభివృద్ధి చేస్తాం

ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో రుద్ర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌర్ణమిరోజున ఆలయ ప్రాంగణంలో రుద్ర హోమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందరి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాండు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ

పౌర్ణమిని పురస్కరించుకొని పాంబండ రామలింగేశ్వర ఆలయంలో భక్తులు గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొడుగోనిపల్లి రోడ్డు



కోతకు గురైన బీటీ రోడ్డు

దోమ: మండలంలోని గొడుగోనిపల్లి వద్ద బీటీ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు ఇరువైపులా కోతకు గురై భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాల బారిన పడటం ఖాయంగా కనిపిస్తోంది. రోడ్డు కోతకు గురై నెలలు కావస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మట్టి కూడా పోయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాండూరు: తాండూరు పట్టణంలో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఆ శాఖ డీఈఈ భానుప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని 33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 8నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఆపేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పరిగి సబ్ స్టేషన్ పరిధిలో..

పరిగి: పరిగి సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మల్లెమోనిగూడ, నస్కల్, రుక్కుంపల్లి, భర్కత్‌పల్లి గ్రామాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్



శ్రీవారి ఆలయం వద్ద ఎమ్మెల్యే దంపతులు

పరిగి: కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామిని సోమవారం పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

రాగిజావతో ఆరోగ్యం పదిలం

ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్



రాగిజావ పంపిణీ చేస్తున్న నాయకులు

యాలాల: వేసవిలో రాగిజావ తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తాండూరు ఏఎంసీ డైరెక్టర్ గోనేగారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ మాజీ సర్పంచ్ పేరి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పేరి రాజేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చలివేంద్రం ద్వారా రాగిజావ, అంబలి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, రాములు గౌడ్, బీ నర్సింహులు, సుదర్శన్, లాలు, వెంకటప్ప, మధిన్, భాస్కర్, హన్మంతు, బాలు, రాములు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రామన్నగూడ గ్రామంలో సోమవారం సీపీఐ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులను తీసుకొచ్చి హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు విమర్శించారు. అఖిల భారత కార్మిక సంఘాలు ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను సోమవారం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. సోమవారం పట్టణంలోని ముఖ్య కూడలిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్వతాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను సవరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని ఆరోపించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా చట్టాలను మార్చుతోందని ఆరోపించారు. కార్మికులు కోల్పోయిన చట్టాలను తిరిగి పొందడానికి జరిగే పోరాటంలో కార్మికులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. దేశంలో రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కొనుగోలుచేసే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని విమర్శించారు. కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 20న సార్వత్రిక సమ్మెకు దిగుతున్నారని, సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, కేశంపేట మండల కార్యదర్శి గోవిందు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తెల్ల జొన్న సాగుపై ఆసక్తి

బంట్వారం: తక్కువ పెట్టుబడి.. లాభాలు ఎక్కువగా ఉండటంతో పలువురు రైతులు తెల్ల జొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నీటి వసతి ఉన్న రైతులు వేసవి ప్రారంభంలో తెల్ల రకం జొన్న పంట వేశారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో సుమారు 750 ఎకరాల్లో పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. దిగుబడి బాగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సుల్తాన్‌పూర్‌లో సాగు చేసిన తెల్ల జొన్న

జోరందుకున్న ‘ఇందిరమ్మ’



మరికల్ గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు

పలు గ్రామాల్లో చురుగ్గా ఇళ్ల నిర్మాణం

- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. కుల్కచర్ల మండలంలో 510 మందిని, చౌడాపూర్ మండలంలో 271 మంది లబ్ధిదారులకు ఎంపిక చేశారు. మోడల్ విలేజ్‌లు అయిన అనంతసాగర్‌కు 119 ఇళ్లు, మక్త వెంకటాపూర్‌కు 109 ఇళ్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో పునాదుల పనులు పూర్తయ్యాయి. లబ్ధిదారులకు మొదటి విడత డబ్బు కూడా మంజూరైనట్లు తెలిసింది. మరో పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ఉండే అవకాశం ఉంది. దీంతో మొదటి జాబితాలో పేర్లు లేని వారు రెండో జాబితా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోంది



పై ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు కిష్టమ్మ.. అనంతసాగర్ గ్రామంలో ఓ పాతబడిన ఇంట్లో జీవనం సాగిస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే భయం భయంగా గడిపేది. ఇంట్లోకి వర్షపు నీరు రాకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుకుంది. రెండు నెలల క్రితం ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం మొదటి దశ పనులు(పునాదులు) పూర్తయ్యాయి. రెండో విడత పనులు చేపట్టనున్నట్లు తెలిపింది. త్వరలో సొంతింటి కళ నెరవేరుతుందని సంతోషం వ్యక్తం చేస్తోంది.

చాలా సంతోషంగా ఉంది

నా పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ఇటీవల అధికారులు గ్రామానికి వచ్చి ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. ఇందిరమ్మ ఇంటి జాబితాలో తన పేరు ఉందని చెప్పారు. త్వరలో పునాది పనులు ప్రారంభిస్తాం.

– తానెం అన్నపూర్ణ, ముజాహిద్‌పూర్

వేగంగా ఇళ్ల నిర్మాణం

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలకు 781 ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ పనులను పర్యవేక్షిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యదర్శులకు అప్రమత్తం చేస్తున్నాం. సకాలంలో పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులకు చెబుతున్నాం. త్వరలో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

– రామకృష్ణ, ఎంపీడీఓ కుల్కచర్ల

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మోమిన్‌పేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత అందరినీ కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అప్పట్లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, మల్లేశం, వెంకటయ్య, బక్కయ్య, రిజ్వానా బేగం, చంద్రశేఖర్‌రావు, జనార్దన్, రమేష్‌రెడ్డి, రుక్కయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.